క్లుప్తంగా...

నిరుపేదలు 'ఆయుష్మాన్' కార్డులు పొందాలి



కార్డులను అందజేస్తున్న బీజేపీ నాయకులు శివకుమార్‌యాదవ్, లక్ష్మీనారాయణ

జియాగూడ: ఆయుష్మాభారత్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను నిరుపేదలు తప్పకుండా పొందాలని గోల్కొండ జిల్లా బీజేపీ డైరీ సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్, జియాగూడ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలో ఇన్సూరెన్స్ కార్డులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..నిరుపేదలకు ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా రూ.5 లక్షల వరకు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్ చౌగ్లే, నరేష్, మనోహర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



గోల్కొండ: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్న విషయం ప్రతి ఒక్కరికి తెలుసని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి సునీల్‌బన్సల్ అన్నారు. శనివారం బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ ఆయనను కలిశారు. కార్వాన్ నియోజకవర్గం టికెట్ తనకే కేటాయించాలని ఆయన తన బయోడెటాను ఆయనకు అందించారు. సీఎం కేసీఆర్ కుటుంబం బాగు కోసం అవినీతికి పాల్పడుతూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రజలు స్వచ్ఛమైన పాలన కోరుకుంటున్నారని బీఆర్ఎస్ అవినీతి, అసమర్థ పాలనతో విసుగెత్తిపోయారని ఆయన అన్నారు. టికెట్ల కేటాయింపు సమయంలో మీ బయోడెటాను పరిశీలిస్తామని ఆయన దేవర శ్రీనివాస్‌కు హామీ ఇచ్చారు.

టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ ఏజెంట్లకు అవార్డులు



అబిడ్స్: టీఎస్ ఆర్టీసీ ప్రవేశపెట్టిన లాజిస్టిక్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ఏజెంట్లకు అవార్డులు లభించాయి. గోషామహల్ నియోజకవర్గంలో గౌలిగూడ ఏజెంటు బి.రాజేశ్వర్‌కు ప్రథమ అవార్డు, రెండో అవార్డు కమలాకర్‌కు, మూడో అవార్డు సాయికి లభించాయి. వారికి అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్గో పార్సిల్ కోసం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సైదులును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సన్మానం



అబిడ్స్: మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌ను అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్ సత్కారం చేశారు. నూతనంగా వైస్ చైర్మన్‌గా నియమితులైన ఆయనను మల్లిపెద్ది శంకర్ సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరించాలన్నారు. వైశ్య కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేస్తే ఆర్యవైశ్యులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు.

సిటీ కళాశాలకు ఐఎస్ఓ 21001:2018 గుర్తింపు



చార్మినార్: సిటీ కళాశాల, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులలో మౌలిక ప్రతిభను వెలికితీసి వారి సర్వతోముఖ వికాసానికి కృషి చేస్తుందని హిమ్స్ ఇంటర్నేషనల్ సంస్థ సీఈఓ ఆలపాటి శివయ్య అన్నారు. అంతర్జాతీయ విద్యాబోధన ప్రమాణాలను మదింపు చేసి కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు గుర్తింపును అందించే ఐఎస్ఓ 21001:2018 ధ్రువపత్రాన్ని తమ సంస్థ నుంచి సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్‌కి శివయ్య అందజేశారు. సిటీ కళాశాల గతంలో 9001:2015 ప్రమాణాల ప్రకారం గుర్తింపు పొందిందని.. ఇప్పుడు అంతర్జాతీయంగా పెంచిన కొత్త ప్రమాణాల ప్రకారం వివిధ విభాగాల ద్వారా కళాశాల అందిస్తున్న సేవలను గుర్తించి ఈ ధ్రువపత్రం అందించామన్నారు.

నిజామ్స్ మ్యూజియంలో
వార్డ్ రోబ్స్ పునఃప్రారంభం



ప్రారంభోత్సవంలో ఏకే ఖాన్ తదితరులు

చార్మినార్: ప్రిన్స్ ముఖర్రం జా బహదూర్ 90వ జయంతి ఉత్సవాల సందర్భంగా ముఖరమ్ జాహ్ ఫౌండర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ జాహి పాలకుడు నవాబ్ మీర్ మహబూబ్ అలీ ఖాన్ వార్డ్ రోబ్స్‌ను నిజామ్స్ మ్యూజియంలో పునఃప్రారంభించారు. రిటైర్డ్ ఐపీఎస్ ఏకే ఖాన్ చేతుల మీదుగా ఈ ప్రారంభోత్సవం జరిగింది. ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన వార్డ్ రోబ్‌ను బర్మా టేకు, కలపతో 176 అడుగులతో తయారు చేయడం విశేషం. ఫౌండర్స్ డేలో ఏకే ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫోరమ్ ఫర్ డెమొక్రసీ అండ్ గ్లోబల్ పీస్ చైర్మన్ శ్యామ్ మోహన్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ముఖర్రం జాహ్ ఎడ్యూకేషనల్ ట్రస్టీలు నవాబ్ ఎం.ఎ.ఫైజ్ ఖాన్, ఫైజ్ బిన్ జంగ్ కార్యక్రమ నిర్వహణను చేపట్టారు. సెక్రటరీ ఇండియాపస్ రిటైర్డ్ కర్నల్, ముఖర్రం జాహ్ ప్రిన్సిపాల్ రేఖా వాధ్వా, అకాడమీ డైరెక్టర్ కౌసర్ సయీదా కార్యక్రమాన్ని ముందుండి నడిపారు. ఏకే ఖాన్ మాట్లాడుతూ.. నిజామ్ నవాబు విద్యారంగంలో చేపట్టిన సేవలను కీర్తించారు. ఉస్మానియా యూనివర్సిటీ స్థాపన, ఆయన చూపించిన మతసామరస్యాన్ని గురించి వివరించారు. ముఖరం జాహ్ స్కూల్ విద్యా ప్రమాణాలు బాగున్నాయన్నారు. విద్యార్థులు తమ రాత నైపుణ్యాలను పెంపొందించుకొని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ఉపాధ్యాయులు పట్ల గౌరవంతో మెలగాలని హితవు పలికారు. శ్యామ్ మోహన్ మాట్లాడుతూ.. ముఖరం జాహ్ స్కూల్ ఉన్నత విద్యా ప్రమాణాలతో బోధన జరగడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ సంస్కృతి సంప్రదాయాలకు గౌరవిస్తూ ఈ స్కూల్ విద్యా ప్రమాణాలున్నాయన్నారు. విద్యతోనే ప్రపంచంలో మార్పు సాధ్యమన్న గాంధీ సూక్తులను ఆయన ఉటంకించారు. ఫైజ్ ఖాన్ మాట్లాడుతూ.. స్కూల్‌లో ఐటీ వనరులు ఏర్పాటు చేశామన్నారు. క్రీడా సౌకర్యాలు కల్పించామన్నారు. ఎన్‌సీసీలో పాలు పంచుకునేందుకు విద్యార్థినీ, విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రెండేళ్లుగా ఎడ్యుకేషన్ వరల్డ్ బడ్జెట్ స్కూల్ ర్యాంకింగ్‌లలో ముఖర్రం జాహ్ స్కూల్ నెంబర్–1 స్థానాన్ని దక్కించుకుంటుందన్నారు. ముఖర్రం జాహ్ బహదూర్ 8 మహళ్లలో ఉన్న పురానీహవేలి ప్రాంగణాన్ని విద్యా సేవల కోసం అంకితం చేశారన్నారు. ప్రిన్సిపాల్ రేఖా వాధ్య స్వాగత ఉపన్యాం చేశారు. మూడు వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో విద్యార్థులు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్స్ ముఖర్రం జాహ్‌కు నివాళులర్పించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని ఉప్పుగూడ ఆర్‌యూబీ వద్ద శనివారం ఆమె రూ.2.40 లక్షల నిధులతో నూతనంగా సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరుకున్న రోడ్డుతో తాము ఇబ్బందులకు గురవుతున్నామనే విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో నూతన సీసీ రోడ్డు పనులను చేపట్టడం జరిగిందన్నారు. జీహెచ్ఎంసీ ద్వారా మంజూరైన రూ.240 లక్షలతో బస్తీలో నూతన సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా.. తమ దృష్టికి తీసుకొస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు ఆర్.లక్ష్మణ్, శివాజీ, కాశీనాథ్, పరుశురాం, వి.మహేశ్, శ్రీధర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, బి.రమేశ్ యాదవ్, కె.రాజ్‌కుమార్, ఇ.సాయి సందీప్, బొట్టు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసనతో ఉద్రిక్తత

సాక్షి,సిటీబ్యూరో: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని రావణుడితో పోలుస్తూ బీజేపీ ట్విట్టర్ పోస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి ప్రయత్నం హైదరాబాద్ గాంధీభవన్ వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్ యాదవ్, నాంపల్లి ఇంచార్జి ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ దిష్టిబొమ్మకు చెప్పుల దండలు వేసి గాంధీ భవన్ నుంచి భారీ ప్రదర్శనగా బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులను గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు పార్టీ శ్రేణులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఒక దశలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున బారికెట్లు ఎక్కి బయటికి దూకే ప్రయత్నం చేశారు. మరోవైపు కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ ఆఫీస్ ముట్టడికి ప్రయత్నించారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్టేషన్లకు తరలించారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల శిక్షణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ

జియాగూడ: ఈనెల 8న జియాగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఒక్కరోజు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. శనివారం జియాగూడ బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జియాగూడ బీఆర్ఎస్ పార్టీ సౌజన్యంతో కార్యకర్తల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం దుర్గానగర్‌లో గల భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణా అధికారులు ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ క్యాంపు ద్వారా ఉంటుందని ఇందులో 58 బస్తీలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు శిక్షణ పొందుతారని తెలిపారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శిక్షణల ద్వారా బీఆర్ఎస్ కార్యకర్తలు సంసిద్ధులవుతారన్నారు. ఈ శిక్షణలో 108 బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా అలాగే మహిళలకు కూడా సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. మల్లన్న గుడి ప్రాంతంలోని ఏకే భవన్‌లో మధ్యాన భోజనం అనంతరం ఏర్పాటు అయ్యే సభకు ముఖ్య అతిథులుగా హోంశాఖ మంత్రి మహమూద్ అలీ హాజరై ప్రసంగిస్తారు. చివరగా శిక్షణ పొందిన కార్యకర్తలకు ఐడీ కార్డులు, సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నరహరిచారి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, కార్వాన్ యూత్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, జడల మోహన్ బాబు, రఘునాథ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రామాయణ్ మేళాకు భారీ ఏర్పాట్లు



అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాజస్థాని ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రామాయణ్ మేళాకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠీ పేర్కొన్నారు. ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. 17వ తేదీ నుంచి రామాయణ్‌మేళా ఉంటుందన్నారు. రామాయణ్‌మేళాలో కవి సమ్మేళనం పెద్ద ఎత్తున చేపడుతామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన కవులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతిరోజూ రామాయణ పఠనం, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. గిరిధర్‌లాల్ దాగ, మనోజ్ జైస్వాల్, సుమిత్‌రాఠి, నందగోపాల్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యం మెరుగునకు డిజిటలైజేషన్ దోహదం



మాట్లాడుతున్న జయేష్ రంజన్ తదితరులు

సుల్తాన్‌బజార్: వైద్యరంగంలో ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ ఎంతో దోహదం చేస్తుందని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ అన్నారు. మూడు రోజులుగా ఉస్మానియా మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైద్య ఆరోగ్య రంగంలో కూడా డిజిటలైజేషన్ ప్రక్రియ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఈ ప్రక్రియను ఉపయోగించడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్యంలో డ్రోన్ టెక్నాలజీ, నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ ఆయుష్మాన్ భారత్ ఆధునిక యంత్రాల ద్వారా ఆరోగ్య పరిరక్షణ డిజిటలైజేషన్ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 400 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ అసోసియేట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొని రీసెర్చ్ పేపర్స్ ప్రజెంటేషన్ చేశారు. కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ కె.భవాని ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పబ్లిక్ హెల్త్ నిష్ణాతులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్మయి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ అహ్మద్, జె.కిరణ్‌మయి, ఉమారాణి, అనుపమ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నర్సింహనాయక్

సంతోష్‌నగర్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాంగ్ రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, జీబ్రా క్రాసింగ్ వద్ద వాహనదారులు విధిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. మైనర్లకు తమ వాహనాలను అందిస్తే తప్పనిసరిగా వాహన యజమానికి జైలుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే విధంగా ఆటోలను ఎక్కడ పడితే అక్కడ ఆపకుండా ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించామన్నారు. ఐఎస్‌సదన్ చౌరస్తా వద్ద రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు గురవుతున్న నేపథ్యంలో ఆర్టీసీ డీఎంలతో మాట్లాడి బస్టాప్‌లను కొద్ది ముందుకు మార్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. స్టేషన్ పరిధిలోని స్కూళ్లల్లో ఇప్పటి వరకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి స్కూల్ సమయాన్ని 10 నిమిషాలు వ్యవధిలో అటు ఇటుగా మార్చాలని ప్రిన్సిపాల్‌లకు సూచించడం జరిగిందన్నారు.

పోలీసులకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి



లంగర్‌హౌజ్: పోలీసులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసుకుంటూ ఉండాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం లంగర్‌హౌజ్ పోలీస్‌స్టేషన్‌లో సాప్ కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో మీ కిడ్నీల గురించి తెలుసుకోండి అనే అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు ఆస్పత్రుల వారు పోలీసులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం హర్షనీయమన్నారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ షోయబ్ ఏ ఖాన్ మాట్లాడుతూ.. మారుతున్న జీవన శైలికి అనుగుణంగా ఆహారపు అలవాట్లను కూడా మార్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లంగర్‌హౌజ్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రావు, సాప్ మెడికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.

ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

గౌలిపురా: ప్రజల సౌకర్యార్థం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేశ్‌యాదవ్ తెలిపారు. పాతబస్తీలోని గౌలిపురా, అలియాబాద్, లాల్‌దర్వాజా తదితర ప్రాంతాల ప్రజలకు ఆధార్ నమోదు, తప్పులు, చిరునామా తదితర వాటిని సరి చేసుకోవడానికి స్థానికంగా ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజల సౌకర్యార్థం లాల్‌దర్వాజా పూల్‌బాగ్ గ్రౌండ్, గౌలిపురా మిత్రా క్లబ్ ప్లే గ్రౌండ్‌లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు గాంధీపురా గంగపుత్ర సంఘం ఎన్నికలు

గౌలిపురా: సుల్తాన్‌షాహీలోని గాంధీపురా గంగపుత్ర సంఘం ఎన్నికలను ఈనెల 8న నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. గాంధీపురా గంగపుత్ర సంఘం అధ్యక్షుడి కోసం ఈ ఎన్నికలను నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల అధికారులుగా మోకాల లక్ష్మీనారాయణ, బడా రమేశ్ వ్యవహరించనున్నారన్నారు. ఆదివారం ఓటింగ్ జరుగుతుందని.. లెక్కింపు చేపట్టి విజేతను ప్రకటిస్తామన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఖాదర్‌బాగ్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నానల్‌నగర్ డివిజన్ ఖాదర్‌బాగ్, ఇందిరానగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకోని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ దశాబ్దాలుగా నగరవాసుల సమస్యలను పరిష్కరిస్తూ వస్తుందన్నారు. మజ్లిస్ పనితనం వల్లే ప్రజలు తమను ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా తాను కృషి చేస్తున్నానన్నారు. మరోవైపు కార్వాన్ నియోజకవర్గంలో వర్గాలకు అతీతంగా అన్ని బస్తీలు, కాలనీల్లో అభివృద్ధి పనులు చేయించానని ఆయన తెలిపారు. కొన్ని రోజుల క్రితమే ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నియోజకవర్గంలో సుమారు రూ.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సీనియర్ మజ్లిస్ నాయకులు షబ్బీర్ ఖాన్ తదితరులున్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు'



మహిళా జూనియర్ లైన్‌మెన్ లలితకు నియామకపత్రం అందజేస్తున్న డీఈ రాంచందర్

గోల్కొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని నానల్‌నగర్‌లోని విద్యుత్ సర్కిల్ కార్యాలయ డివిజనల్ ఇంజినీర్(టెక్నికల్) కావలి రాంచందర్ అన్నారు. నానల్‌నగర్ చౌరస్తా వద్ద గల రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సర్కిల్‌లో మొదటి మహిళా జూనియర్ లైన్‌మెన్‌గా నియమితులైన లలితకు ఆయన నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు తమ సామర్థ్యంతో అన్ని రంగాల్లో మగ వారికి దీటుగా విధులు నిర్వహించడమే కాకుండా తాము పని చేస్తున్న రంగంలో అగ్రగాములుగా నిలుస్తున్నారన్నారు. తమ విద్యుత్ సర్కిల్ పరిధిలో జూనియర్ లైన్‌మెన్‌గా నియమితులైన లలిత సమర్థవంతంగా విధులు నిర్వహించే సత్తా గల మహిళ అని ఆయన పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ ఆడేవారికి ఉజ్వల భవిష్యత్తు

గోల్కొండ: ఫుట్‌బాల్ ఆడేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. నెల రోజులుగా నగరంలో జరుగుతున్న వివిధ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లలో పాల్గొన్న గోల్కొండ ఫుట్‌బాల్ టీమ్‌లను శుక్రవారం గోల్కొండ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ ఫుట్‌బాల్ ఆటకు పేరు గాంచిందని, నాలుగు దశాబ్దాలుగా గోల్కొండకు చెందిన ప్లేయర్లు దేశానికి ప్రాతినిత్యం వహించారన్నారు. నేడు గోల్కొండలో వందల సంఖ్యలో టీనేజర్స్ ఫుట్‌బాల్‌లో ప్రావీణ్యం పొందారని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ ఫుట్‌బాల్ కోచ్ సఫ్దర్‌పాషా వీరందరిని నగరంలోని వివిధ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అహ్మద్, డేవిడ్, షమీన్ తదితరులు ఉన్నారు.



ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అమలు చేయండి



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విక్రమ్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో 60 శాతం జనాభా ఉన్న బీసీలకు రాబోయే ఎన్నికల్లో 50 సీట్లు కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకీ బీసీలు అండగా నిలిచారని, కర్ణాటక మాదిరి బీసీలకు అత్యధిక సీట్లు కేటాయిస్తే కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కె.గణేష్ చారి, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్ పాల్గొన్నారు.

కళా వైభవాన్ని కాపాడుకోవాలి



నృత్యగురువులను సన్మానిస్తున్న దామోదర్‌గుప్తా, వేణుగోపాల చారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: కళా వైభవాన్ని కాపాడుకోవాలని పలువురు ప్రముఖులు సూచించారు. శనివారం రవీంద్ర భారతిలో భారత ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని సకలకళ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్‌గుప్తా, నీటిపారుదల శాఖ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి మాట్లాడుతూ.. డిసెంబర్ 24న 7 వేల మంది కళాకారులతో కూచిపూడి కళా వైభవాన్ని నిర్వహించతలపెట్టడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీవీ నటులు సోని, ఎల్.నరేష్, రోజ, ఏబీసీ ఫౌండేషన్ అధ్యక్షులు లయన్ రమణారావు, భారత ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు లలిత తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తలసాని సహకారంతో గోషామహల్ అభివృద్ధి



మంగళ్‌హాట్‌లో పర్యటిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్, జీఎం జాన్ షరీఫ్

అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో గోషామహల్ నియజకవర్గంలో అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారాలు వేగవంతంగా చేపడుతున్నట్లు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్ డివిజన్‌లోని బడాబంగ్లా, మంగళ్‌హాట్ శివమందిర్ ప్రాంతాల్లో వాటర్ బోర్డు జీఎం జాన్‌షరీఫ్, డీజీఎం శ్రీనివాస్, మేనేజర్ రమేష్‌తో కలిసి ఆయన పర్యటించారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తానన్నారు. పలు సమస్యలను మంత్రి తలసాని దృష్టికి తీసుకువెళ్లి పలు శాఖల అధికారులచే పరిష్కారం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బల్‌దీప్ సింగ్, శ్రీనివాస్ యాదవ్, నరేష్‌గౌడ్, సుభాషింగ్, తుల్జారామ్ సింగ్, అర్జున్ సింగ్, ప్రకాష్ సింగ్, నర్సింగ్ సింగ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, కార్పొరేటర్లు

యాకుత్‌పురా: తలాబ్‌కట్టాలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ శనివారం ప్రారంభించారు. సంతోష్‌నగర్ సర్కిల్ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. ఆయన తలాబ్‌చంచలం, మొఘల్‌పురా కార్పొరేటర్లు సమీనాబేగం, నస్రీన్ సుల్తానా, యూసీడీ డిప్యూటీ ప్రాజెక్టు అధికారి రత్నమ్మలతో కలిసి లబ్ధిదారులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీల అధ్యక్షులు, యూసీడీ విభాగం కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శంకర్‌యాదవ్

బేగంబజార్ డివిజన్‌లో..

అఫ్జల్‌గంజ్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ పండుగను జరుపుకోవాలని బేగంబజార్ కార్పొరేటర్ గౌంటి శంకర్ యాదవ్ అన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బేగంబజార్ డివిజన్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. నాయకులు కట్టా రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.